
## చిట్టికథల పోటీలో రూ. 150 బహుమతి పొందిన కథ



"గోపయ్యగారి పెరటితోటలో వినాయకుడు వెలిశాడు... ఆహా రామాపురం ఏమి అదృష్టం చేసుకుంది. గోపయ్యగారు పూర్వజన్మలో ఎంత పుణ్యం చేసుకున్నారో..."

ఆ వూరు, చుట్టు పక్కల గ్రామాల్లోకి ఈ వార్త కార్చిచ్చులా వ్యాపించింది. ఆ వింత చూడడానికి జనం తండోపతండాలుగా తరలి రాసాగారు. ఇంతకూ దీని పూర్వ రంగం ఏమిటి?

గోపయ్యగారి పాలేరు పోలయ్య ఆ రోజు తెల్లవారుజామున పొలానికి వెళ్లేముందు- అలవాటు ప్రకారంగా తన గుడిసెలోంచి పెరటి తోటలోకి వచ్చాడు. పాదులు,చెట్లు అవీ పరామర్శ చేయడానికి.

అల్లంతదూరంలో– అరటి చెట్లకు సమీపంగా వున్న- స్థలంలో- భూమి మీద ఏదో కదులు తున్నట్లు అనిపించింది. ఆశ్చర్యంగా అటువైపే చూస్తూ, దగ్గరకు వెళ్లాడు. పోలయ్య ఒళ్లు కంపించింది. నేలమీదున్న మట్టిలో ఏదో కదలిక. ఆ మట్టిలోంచి విగ్రహం లాంటిది ఏదో పైకి వస్తున్నట్లుగా...

పోలయ్య గట్టిగా కేక పెట్టాడు. గోపయ్యగారి ఇంట్లో వాళ్లు, చుట్టుపక్కల వాళ్లు ఆ కేకలకు ఉరకులు, పరుగులమీద అక్కడికి వచ్చారు.

# వ్యవస్థ

## – ఎన్. మాలతి

"దేవుడు వెలిశాడు.. దేవుడు వెలిశాడు..." అనే వార్త క్షణాల మీద ప్రాకిపోయింది. ఆ వూరి పెద్దలు అక్కడికి చేరుకునే సరికే-- అప్పుడే అక్కడ మూగిన జనాన్ని అదుపులో పెట్టడం కష్టమై పోయింది.

పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు బంగారాజు గారు, ఎమ్.ఎల్.ఎ. కోటిలింగంగారు, ఇంకా మరికొందరు పెద్దలు ఆ పెరటితోటలోకి వచ్చే సరికి గోపయ్యగారు అక్కడ భక్తి పారవశ్యంతో కూర్చుని ఉన్నారు.

"ఆహా.. ఎంత పుణ్యం చేసుకున్నారండీ మీరు..." అన్నారు కోటిలింగంగారు ఆ వినాయకుడి విగ్రహం వంక చూసి నమస్కరిస్తూ.

"ఏం చెప్పమంటారు ఆ భగవంతుడి లీల.. నిన్న రాత్రి నాకు కలలో కనిపించి- 'గోపయ్యా.. నీ పుణ్యం ఫలించింది. నీకు, మీ వూరికి మేలు చేయడానికి ఇక్కడే వెలుస్తున్నాను.. నాకొక గుడి కట్టించు' అన్నారు ఆ వినాయకస్వామి. తెల్లవారుజామున అన్నట్టుగానే కనిపించాడు స్వామి. మా పోలయ్య మహాపుణ్యాత్ముడు... మొట్టమొదట ఆ స్వామిని దర్శించుకున్నది మా పోలయ్యే" అన్నారు గోపయ్యగారు- అల్లంత దూరంలో చేతులు కట్టుకుని నిలబడి వున్న పోలయ్యను చూపిస్తూ.

"ఇక ఆలస్యం ఎందుకు? పండితుల్ని పిలిపించాలి. విగ్రహం ప్రతిష్ఠించడానికి ముహూర్తం పెట్టించాలి. పూజలు ఆరంభించాలి. మనం చెయ్యవలసిన పని చాలా వుంది. ముందు ఈ జనాన్ని అదుపులో పెట్టడానికి మన ఎస్.ఐ. సూరిబాబుకు కబురు పంపించండి" అన్నారు కోటిలింగంగారు అక్కడున్న వాళ్లందరికీ పనులు పురమాయిస్తూ.

• • •

గోపయ్యగారు తన పెరటితోట స్థానంలో వినాయకుడి గుడి కట్టడానికి అన్ని ఏర్పాట్లూ చేయించారు. ఆలయ నిర్వహణకు ఒక కమిటీ ఏర్పడింది. ఊళ్లో ఉన్న పెద్దలు కొందరు– అధ్యక్షుడు, కార్యదర్శి మొదలైన పదవులకు ఎంపికైపోయారు. విగ్రహానికి పూజలు ప్రారంభించారు. యథాప్రకారంగా విరాళాల సేకరణ ఆరంభమైంది. ఇక హుండీ వసూళ్ల సంగతి చెప్పనక్కరలేదు. జనం పూర్తిగా వినాయకుడి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు!

• • •

"అన్నయ్యా... భూమిలోంచి దేవుడి విగ్రహం వెలిసినట్లు చెప్పడం అంతా బూటకం... గుడి పేరు మీద పెద్దలందరూ అమాయకజనాన్ని మోసంచేసి, వేలకు వేలు కాజేయడానికి నాటకం ఆడుతున్నారు" అంది నిర్మల ఆవేశంగా.

అప్పుడే భోజనం చేసి, తాంబూలం వేసుకుంటున్న ఎస్.ఐ. సూరిబాబు చెల్లెలి మాటలు విని ఉలిక్కిపడ్డాడు. క్షణంలో తమాయించుకున్నాడు.

"అదేమిటే... ఈ వూళ్లోకి వచ్చి ఇంకా మూడురోజులు కూడా కాలేదు. అప్పుడే అన్నీ తెలుసుకున్నట్లు మాట్లాడుతున్నావే" అన్నాడు సూరిబాబు నవ్వుతూనే.

నిర్మల పట్నంలో బి.ఎ. చదువుతూ, సెలవుల్లో- కొత్తగా రామాపురానికి బదిలీ అయివచ్చిన అన్నయ్యను చూడడానికి వచ్చింది. వచ్చీ రాగానే ఆ వూరి పరిస్థితిని అర్థం చేసుకుంది.

"నేను చెబుతున్నది నిజం అన్నయ్యా... నిన్న సాయంత్రం ఈ వూళ్లో ఉన్న లైబ్రరీకి వెళ్తే, అక్కడ సుధీర్ అనే సోషల్ వర్కర్ పరిచయమయ్యారు.

ఇక్కడి ప్రజల్లో మూఢనమ్మకలు ఎక్కువగా వున్నాయని, వాళ్లు ఎలా మోసగింపబడుతున్నారో వాళ్లకు చెప్పాలని పాపం ఆయన ఎంత కాలంగానో ప్రయత్నిస్తున్నాడట. ఈ విగ్రహం ట్రిక్కు ఎలా చేయవచ్చునో కూడా నాకు చెప్పాడు. సెనగలు భూమిలో వేసి, వాటిపైన విగ్రహాన్ని పెట్టి నీళ్లు పోస్తుంటే, కొన్ని రోజులకు ఆ సెనగలు ఉబ్బి, ఆ శక్తికి- క్రమ క్రమంగా విగ్రహం పైకి వస్తుందట. గోపయ్యగారు రోజూ ఉదయం వినాయకుడి విగ్రహం ముందు ప్రమీద పెట్టి, రెండు నిమిషాలపాటు ధ్యానం చేస్తే, ప్రమీదలోంచి 'అగ్ని' పుట్టుకొస్తుందనడం కూడా ట్రిక్కే. అదీ ఆయన చేసి చూపించాడు. పొటాసియం పెర్మాంగనేట్ మీద ఒక చుక్క గ్లిసరిన్ వేస్తే, రెండు నిమిషాలకు అందులోంచి మంట వచ్చింది. అలాగే గాల్లోంచి విభూతిని తెప్పించడం లాంటివి అన్ని ఆయన చేస్తున్నాడు. ఈ 'బాణామతి', 'పూనకం' లాంటివి మానసికమైన జబ్బులనీ, మంత్రాలు - తంత్రాలు అంటూ జనాన్ని కొందరు ఎలా మోసం చేస్తున్నారో అన్నీ ఆయన స్పష్టంగా వివరిస్తున్నాడు. కానీ పామర జనం అతని మాటలు వినిపించుకోవడం లేదు. పైగా 'గోపయ్యగారిలాంటి భక్తుల్ని, కోటి లింగం గారిలాంటి పెద్ద మనుషుల్ని అనుమానిస్తావా?' అంటూ అతని మీద కొందరు మండిపడ్డారు కూడా" అంది నిర్మల అదే ఆవేశంతో.

"సరే.. నువ్వు నిజానిజాలు తెలుసుకున్నావ్ కదా... అది చాల్లే... మళ్లీ ఆ మనుషులవైపు వెళ్లకు... నీకు సంబంధంలేని విషయాల్లో నువ్వెందుకు కలుగజేసుకుంటావ్?" కొంచెం కటువుగానే అన్నాడు సూరిబాబు.

నిర్మల ఆ మాటలకు చిన్నబుచ్చుకుంది. అప్పుడే అక్కడకు వచ్చిన సూరిబాబు భార్య రేవతి పరిస్థితిని అర్థం చేసుకుంది.

"ఈ పోలీసు వాళ్లతో వాదనలు పెట్టుకోకూడదే తల్లీ... పద, సినిమాకు టైమ్ అవుతోంది" అంటూ నిర్మల 'మూడ్' మార్చి తీసుకువెళ్లిపోయింది.

సూరిబాబు చెల్లెలి వంక చూస్తూ నిట్టూర్చాడు.

• • •

ఎమ్.ఎల్.ఎ కోటిలింగంగారు హాల్లో కాలు గాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఆయన 'ఆజ్ఞ' కోసం నలుగురు వ్యక్తులు ఆత్రుతగా అక్కడే నిలబడి ఎదురు చూస్తున్నారు.

"మనం 'వార్నింగ్' యిచ్చినా వాడు లెక్కచేయలేదంటే, ఏమిటి ఆ సుధీర్‌గాడి ఉద్దేశం?" గర్జించాడు కోటిలింగం.

"మీరు ఒక్కమాట చెప్పండయ్యా... వాడి అడ్రసు లేకుండా లేపేస్తాం... మీ అంత పెద్దవారి మాట కాదనడానికి వాడికెన్ని దమ్ములుండాలి?..." వాళ్లల్లో ఒకడు కర్కశంగా అన్నాడు.

"మనిషిని లేపేయకండి.... మళ్లీ 'ఎలక్షన్లు' వస్తే, అదొక పెద్ద గొడవ అయిపోతుంది. వాడి కాళ్లో చేతులో విరగ్గొట్టండి చాలు... అదీ వాడు మీటింగు పెట్టినప్పుడు... మీటింగులో జనం వాడి మాటలు నచ్చక, చేతులు కాళ్లు విరగ్గొట్టిన 'కలర్' యివ్వండి... దాంతో వాడు మళ్లీ ఆ విషయాలు మాట్లాడడు... మన పేరు మాత్రం ఎక్కడా రాకూడదు. తెలిసిందా?" అన్నారు కోటిలింగం గారు వాళ్లవైపు తీక్షణంగా చూస్తూ.

అర్థమైందన్నట్లుగా అందరూ తలలూపి, అక్కణ్ణుంచి కదిలారు.

• • •

సుధీర్‌ను ఎస్.ఐ. సూరిబాబు అరెస్ట్‌చేసి, 'లాకప్'లో పెట్టిన వార్త - లైబ్రరీలో విని నిర్మల నిర్ఘాంతపోయింది. ఆవేశంతో అక్కణ్ణుంచి తిన్నగా పోలీస్ స్టేషన్‌కు వచ్చింది.

లోపలికి వస్తుండగా, 'లాకప్'లో ఉన్న సుధీర్ ఆమెను చూసి చిరునవ్వు నవ్వాడు. అతన్ని అలా చూసిన తర్వాత ఆమెలోని కలవరం కాస్త తగ్గినా, సూరిబాబును చూడగానే ఆవేశంగా ఏదో మాట్లాడబోయింది.

కాస్త ఆగమన్నట్లుగా సంజ్ఞచేసి "పద... నేను ఇంటికే బయల్దేరుతున్నాను. దార్లో మాట్లాడు కుందాం" అని కుర్చీలోంచి లేచాడు సూరిబాబు.

ఇద్దరూ జీప్ దగ్గరకు వచ్చేసరికి -పోలీస్ స్టేషన్ బయట అంతసేపూ నిలబడి ఉన్న నలుగురు వ్యక్తులు -సూరిబాబు దగ్గరకు వచ్చి నమస్కారం పెట్టారు. "బాబుగారూ... సుధీర్‌గారిని ఎప్పుడు వదిలేస్తారు?" వాళ్లల్లో ఒక వ్యక్తి వినయంగా అడిగాడు.

సూరిబాబు వాళ్లవంక పరిశీలనగా చూశాడు. "మీరు ఎమ్.ఎల్.ఎ. కోటిలింగంగారి మనుషులు కదూ?"

"అయ్యో... కాదు బాబూ... ఇవాళ సుధీర్‌గారి మీటింగ్ ఉందంటే, దానికోసం వచ్చాం... ఆయన్ని తమరు అరెస్టు చేశారట... సాయంత్రం మీటింగ్ పెట్టడానికి వదిలేస్తారేమోనని..." ఆ వ్యక్తి మాట పూర్తి చేయకుండానే...

"వదలం... అతని మీద రెండు మూడు క్రిమినల్ కేసులున్నాయి. ఇప్పుడప్పుడే వదిలిపెట్టే అవకాశంలేదు. ఈ సంగతి కోటిలింగం గారికి కూడా చెప్పండి" అని జీప్ స్టార్ట్ చేశాడు సూరిబాబు.


పక్కనే కూర్చుని ఉన్న నిర్మల అయోమయంగా చూసింది.

"సుధీర్‌గారి మీద క్రిమినల్ కేసులా?" అని ఇంకా ఏదో అడగబోయింది నిర్మల - దార్లో.

"చూడమ్మా... నీ ఆవేశం నాకు అర్థమైంది. మీ వంటి వాళ్లు ఎప్పుడూ మీ కోణంలోంచే ఆలోచించి ఆవేశపడతారు. మనం ఎప్పుడూ అవతలి వ్యక్తుల కోణం నుంచి కూడా ఆలోచించాలి. ఇప్పుడు నాతో మాట్లాడిన వాళ్లు ఎమ్.ఎల్.ఎ కోటిలింగంగారి మనుషులు... ఎందుకు వచ్చారో తెలుసా? సుధీర్ కానీ బయట వుండివుంటే, వాళ్లు ఈ పాటికి అతన్ని మర్డర్ చేసి వుండేవాళ్లు..."

ఆ మాటలకు ఉలిక్కిపడింది నిర్మల.

ఆమె కంగారు చూసి, జీప్ ఆపాడు సూరిబాబు.



బొద్దింకలు దాడిచేసే ప్రాంతంలో... వెల్లుల్లి ముక్కను చితగ్గొట్టి - కొంచెం నీటితో కల్పి - ఆ నీటిని చల్లితే చాలు. బొద్దింకలు ఆ ప్రాంతానికి రావు.

"ఈ వూళ్లోని కొందరు పెద్దలు దేవుడి పేరు చెప్పి నాటకం ఆడుతున్నారన్న సంగతి నాకు తెలుసు. సుధీర్ వాళ్ల మోసాలను నిరూపించ గలడనీ నాకు తెలుసు. అందుకే వాళ్లు సుధీర్ మీద శత్రుత్వాన్ని పెంచుకున్నారు. నేను నా అధికారాన్ని ఉపయోగించి, ఈ మోసాన్ని బట్టబయలు చేయడానికి ప్రయత్నిస్తే - ఈ వూరి పెద్దలకూ నేను శత్రువును అవుతాను. వాళ్ల మాటలను వేదవాక్కుగా భావించే ప్రజలూ నన్ను చెడ్డవాడిగా చూస్తారు. వాళ్లుకాని రెచ్చగొడితే, ప్రజలే మాపైన దాడి చేయవచ్చు. మనం ఒక విచిత్రమైన వ్యవస్థలో జీవిస్తున్నాం... గోపయ్య, కోటిలింగం లాంటి వ్యక్తులు తమకున్న డబ్బు, పలుకుబడితో - జనంలోని అజ్ఞానం మీద వ్యాపారం చేసుకుని బ్రతుకుతున్నారు. తరతరాలుగా జనంలో పేరుకుపోయివున్న ఈ అజ్ఞానం, మూఢవిశ్వాసాలు ఒక్కసారిగా పొమ్మంటే పోవు. టీచర్లు, సంఘసంస్కర్తలు, సంఘసేవకులు, మేధావులు, ప్రచార మాధ్యమాల్లో కృషి చేసేవాళ్లు... ఇలా అందరూ ఎప్పటికప్పుడు మూఢ విశ్వాసాలను ఖండిస్తూ వుండాలి. దొంగస్వాములు, మంత్రగాళ్ల మోసాలు బట్టబయలు చేస్తుండాలి. అప్పుడే వాళ్లపై ప్రజలకు నమ్మకం ఏర్పడి వాళ్లమాటలు వింటారు. అలా ప్రజలను కూడదీసుకొని ప్రజాచైతన్యానికి కృషి చేస్తేనే సుధీర్‌లాంటి యువకుల ఆశయాలు తొందరగా నెరవేరతాయి. అంతవరకూ మనకున్న పరిమితులేమిటో తెలుసు కుని, ఒంటరి పోరాటానికి సాహసించకుండా, జాగ్రత్తగా వ్యవహరించాలి. సుధీర్ ఈ దుర్మార్గుల బారిన పడకుండా, అతని రక్షణ కోసమనే నేను 'లాకప్'లో పెట్టాను. అతని మీద ఏ కేసూ లేదు. కానీ కోటిలింగం మనుషులు నేను వాళ్లకు సపోర్టు చేస్తున్నానని అనుకుని నన్ను పరోక్షంగా మెచ్చు కుంటున్నారు. నాకు ఆ సంగతీ తెలుసు. ఈ విషయాలన్నీ సుధీర్‌కు నచ్చజెప్పి, కొన్నాళ్లపాటు ఈ వూరికి రావద్దని చెప్పి, మరోవూరు పంపిం చేస్తాను. అతనికి ఇక ఏ ప్రమాదమూ వుండదు... పైకి కఠినంగా కనిపించినా, నేనూ అన్నీ ఆలోచిస్తానమ్మా" అన్నాడు సూరిబాబు నవ్వుతూ

తనతో ఏమీ మాట్లాడకుండానే, అన్నీ తెలుసు కుంటూ-- మంచికి సహాయపడుతున్న తన అన్నయ్య వంక ప్రశంసాపూర్వకంగా చూసింది నిర్మల. ✤